క్లుప్తంగా

బ్రహ్మారెడ్డి సేవలు మరువలేనివి..



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వెంకటేశ్వర్లు

బూర్గంపాడు: ప్రగతి విద్యాసంస్థల వ్యవస్థాపకుడు సానికొమ్ము బ్రహ్మారెడ్డి సేవలు మరువలేనివని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. అనారోగ్యంతో ఇటీవల మృతిచెందిన బ్రహ్మారెడ్డి విగ్రహాన్ని శనివారం సారపాకలోని ప్రగతి విద్యానికేతన్‌లో కుటుంబ సభ్యులతో కలిసి ఎమ్మెల్యే ఆవిష్కరించి నివాళులర్పించారు.

బతుకమ్మ ఏర్పాట్ల పరిశీలన



అధికారులకు సూచనలిస్తున్న జీఎం రాంచందర్

మణుగూరుటౌన్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలోని పీవీకాలనీ భద్రాద్రి స్టేడియంలో ఈ నెల 29వ తేదీన సింగరేణి ఆధ్వర్యంలో నిర్వహించే సద్దుల బతుకమ్మ, అక్టోబర్ 2వ తేదీన దసరా వేడుకలకు ఏర్పాట్లు చేయాలని ఏరియా జీఎం దుర్గం రామచందర్ సూచించారు. శనివారం భద్రాద్రి స్టేడియంలో జరుగుతున్న వేడుకల ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. సద్దుల బతుకమ్మ, దసరా వేడుకలకు ప్రజలు అధిక సంఖ్యలో వస్తారని, ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని చెప్పారు. కార్యక్రమంలో ఏరియా ఎస్‌ఓటు జీఎం శ్రీనివాసచారి, అధికారులు శ్రీనివాస్, రమేశ్, శ్రీనివాస్, శివప్రసాద్, రామేశ్వరరావు, శోభన్‌బాబు, ప్రవీణ్, రాంచరణ్, రాంగోపాల్, కృష్ణంరాజు, సత్యనారాయణ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

భూమి పూజ

ములకలపల్లి: శిశుమందిర్ ఆవాస విద్యాలయ నూతన భవన నిర్మాణానికి శనివారం భూమిపూజ నిర్వహించారు. రూ.కోటి వ్యయంతో ములకలపల్లి మండల కేంద్రంలో అధునాతన హంగులతో నిర్మించనున్న బిల్డింగ్‌కు విద్యాపీఠం సంఘటన కార్యదర్శి పతకమూరి శ్రీనివాసరావు శంకుస్థాపన చేశారు. భవన నిర్మాణ దాత ప్రసాద్, పటేల్, కృష్ణమూర్తి, మడకం కమల, పద్దం నర్సింహారావు, కార్యదర్శి తాండ్ర ప్రభాకర్‌రావు, గాడి తిరుపతిరెడ్డి, గొడ్ల రాజు పాల్గొన్నారు.

కుల వ్యవస్థ ఉండొద్దు..

దమ్మపేట: మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని, కుల వ్యవస్థను సమూలంగా నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి అమర్లపూడి రాము కోరారు. శనివారం మండలంలోని లింగాలపల్లిలో మాస్‌లైన్ ఆధ్వర్యంలో కుల నిర్మూలన సదస్సును నిర్వహించగా.. రాము మాట్లాడారు. కుల వ్యవస్థ కారణంగా అసమానతలు పెరిగి అంటరానితనానికి దారి తీస్తుందన్నారు. వీరబాబు, కాంతారావు, రాముడు, రమేశ్, గిరి పాల్గొన్నారు.

పంట ధ్వంసం హేయం

గుండాల: చేతికొచ్చిన పత్తి మొక్కలను ధ్వంసం చేసిన ఫారెస్టు అధికారులపై చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రేసు ఎల్లయ్య, న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు కోరం వెంకటేశ్వర్లు, రామ్‌చందర్ డిమాండ్ చేశారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రాయిపాడు గ్రామానికి చెందిన నాగేశ్వరరావు పట్టా కలిగిన భూమిలో పత్తి సాగు చేయగా.. అర్ధరాత్రి ఫారెస్టు అధికారులు ధ్వంసం చేయడం హేయమైన చర్య అని పేర్కొన్నారు. సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుని, రూ.రెండు లక్షల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. రహీం, గుంతోజు శివ, గొగ్గెల పాపారావు పాల్గొన్నారు.

‘ఆమె’కు దక్కిన ప్రాధాన్యత

అశ్వారావుపేట: అశ్వారావుపేటకు సంబంధించి తాజా రిజర్వేషన్లలో ఎస్టీ మహిళలకు ప్రాధాన్యం దక్కింది. అశ్వారావుపేట జెడ్పీటీసీ స్థానంతో పాటు ఎంపీపీ స్థానం కూడా ఎస్టీ మహిళకు రిజర్వు అయింది. ఇప్పటి వరకు ఈ రెండు స్థానాలను ఎస్టీ మహిళలకు రిజర్వు చేయలేదు. ఎంపీపీగా శింగలదేవి జానకీరమణ (బీసీ), జెడ్పీటీసీ సభ్యురాలిగా జూపల్లి పద్మజ పనిచేశారు. ఈ రెండు పదవులూ ఎస్టీ మహిళకు రిజర్వు చేశారు.

జోరు వానలో విధులు

భద్రాచలంఅర్బన్: పట్టణంలో శుక్రవారం కురిసిన భారీ వర్షానికి చెట్టు కొమ్మలు విరిగి ఐటీడీఏ కార్యాలయం, మెడికల్ కాలనీ, వెంకటేశ్వర కాలనీ, శ్రీరామనగర్ కాలనీ, సుందరయ్యనగర్‌లోని విద్యుత్ తీగలపై పడ్డాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. స్పందించిన విద్యుత్ లైన్ ఇన్‌స్పెక్టర్ పదిలం శ్రీను, లైన్‌మెన్ త్రినాథ్‌రెడ్డి, జూనియర్ లైన్‌మెన్ జగదీశ్ చెట్టు కొమ్మలను తొలగించి, విద్యుత్ తీగలకు మరమ్మతులు చేశారు.

సమాచారమివ్వండి..

- విలువైన వస్తువులు లాకర్లలో పెట్టుకుంటే మంచిది
- మద్యం మత్తులో అనర్థాలు తెచ్చుకోవద్దు
- ‘సాక్షి’ ఫోన్‌ఇన్‌లో భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్‌కుమార్ సింగ్

భద్రాచలంఅర్బన్: ముందస్తు జాగ్రత్తలతోనే ఇంట్లో ఉండే వస్తువులతో పాటు ప్రాణాలకు రక్షణ ఉంటుందని, దసరా సందర్భంగా ఇళ్లకు తాళాలు వేసి వెళ్లేవారు తగు జాగ్రత్తలు పాటించాలని భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్‌కుమార్‌సింగ్ సూచించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపొద్దని సూచించారు. సైబర్ మోసానికి గురైన వారు గంట లోపు (గోల్డెన్ అవర్) 1930కి ఫోన్ చేస్తే, మొత్తానికి మొత్తం డబ్బులు రికవరీ చేసే అవకాశం ఉంటుందన్నారు. పండుగల వేళ దొంగతనాలు, మద్యం మత్తులో ప్రమాదాలు, రాత్రి సమయంలో ప్రయాణాలపై శనివారం ‘సాక్షి’ ఫోన్ ఇన్ నిర్వహించగా విశేష స్పందన లభించింది. పలువురు అడిగిన ప్రశ్నలకు ఏఎస్పీ విక్రాంత్ సమాధానాలు ఇచ్చారు.

ప్రశ్న: భద్రాచలం కరకట్టపై పోలీస్ ఔట్ పోస్ట్ ఏర్పాటుకు చర్యలు తీసుకోండి
-దానన్న తరుణ్ నాయుడు, న్యాయవాది, భద్రాచలం
ఏఎస్పీ: ఔట్ పోస్ట్ ఏర్పాటు చేసేందుకు సీనియర్ అధికారులతో మాట్లాడుతాం. తప్పకుండా త్వరలో ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తాను.

ప్ర: భద్రాచలం బస్టాండ్ వద్ద ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టండి.
-శ్రీనివాస్‌రెడ్డి, రెవెన్యూ కాలనీ, భద్రాచలం
ఏఎస్పీ: ఆ ప్రాంతంలో రెండు ఆటో యూనియన్ల ఆటోలు నిలుపుతుండడంతో సమస్య ఏర్పడుతుంది. ట్రాఫిక్ పోలీసులతో చర్చించి పరిష్కరిస్తాం.

ప్ర : పట్టణంలో యువత విచ్చలవిడిగా వాహనాలు నడుపుతున్నారు. వారిని నివారించండి.
-విద్యాసాగర్ / స్నేహ / సాయితిలక్, భద్రాచలం
ఏఎస్పీ: ఇప్పటికే ట్రాఫిక్ పోలీసులు నిత్యం తనిఖీలు చేస్తూ అవగాహన కల్పిస్తున్నారు. ప్రమాదాల నివారణ కోసం మరోసారి అవగాహన కార్యక్రమాలు ఏర్పాటుచేయిస్తాం. పోలీస్, రవాణా శాఖల సంయుక్తంగా ఈ కార్యక్రమాలు నిర్వహిస్తాం.

ప్ర: పండుగ వేళ బస్సుల్లో అధిక రద్దీతో చోరీలు జరిగే ప్రమాదం ఉంది. తగు చర్యలు తీసుకోండి
-లక్ష్మి / శృతిరెడ్డి, భద్రాచలం
ఏఎస్పీ: పట్టణంలోని బస్టాండ్‌లో సిబ్బందిని ఏర్పాటు చేసి దొంగతనాల నివారణకు కృషి చేస్తాం. ఇప్పటికే అక్కడ ఆర్టీసీ పోలీసులు కూడా విధులు నిర్వర్తిస్తున్నారు. రద్దీ సమయాన చైన్ స్నాచర్లు, పిక్ పాకెటింగ్ జరిగే అవకాశమున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.



మాట్లాడుతున్న ఏఎస్పీ విక్రాంత్‌కుమార్‌సింగ్

ప్ర: స్వంత గ్రామానికి వెళ్లే సమయాన పోలీసులకు ఏ విధంగా సమాచారం ఇవ్వాలి?
-కిరణ్‌కుమార్ / దినేష్ / శ్రీకాంత్, భద్రాచలం
ఏఎస్పీ: పోలీస్‌స్టేషన్‌కు వచ్చి వివరాలు ఇవ్వడమే కాక ఇంటి వివరాలతో పాటు లొకేషన్ సమర్పించాలి. తద్వారా పెట్రోలింగ్‌కు వెళ్లే సిబ్బంది ఆ ఏరియాలో పరిశీలిస్తారు. అంతేకాక పక్కింటి వారికి కూడా సమాచారం ఇవ్వండి. విలువైన వస్తువులను బ్యాంకు లాకర్‌లో పెట్టుకుంటే మంచిది. పట్టణంలో చాలా వరకు చోరీలు, చైన్ స్నాచింగ్‌లు తగ్గుముఖం పట్టాయి. ఇప్పటి ఉన్న నిఘా రెట్టింపు చేస్తాం.

ప్ర: పండుగ వేళ ఊర్లకు వెళ్తేఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?
-అశోక్ / నగేష్, భద్రాచలం
ఏఎస్పీ: మీ వెంటే విలువైన వస్తువులు తీసుకువెళ్లటం ఉత్తమం. ఇంటి బయట లైట్ ఆన్‌లో ఉంచాలి. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుని ఫోన్‌కు కనెక్ట్ చేసుకోవాలి. కాలనీల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రజలు ముందుకు రావాలి. ఇళ్లకు సెంట్రల్ లాకింగ్ సిస్టం ఏర్పాటు చేసుకోవడం ఉత్తమం.

ప్ర: రాత్రివేళ ప్రయాణంలో ఎలాంటి జాగ్రత్తలు పాటించాలి?
-ప్రసాద్‌రెడ్డి లావణ్య, భద్రాచలం
ఏఎస్పీ: రాత్రివేళ ప్రయాణం తగ్గించుకోవాలి. చీకటి పడకముందే గమ్యానికి చేరితే మంచిదే. డ్రైవింగ్ చేస్తుండగా నిద్ర వస్తే కాసేపు విశ్రాంతి తీసుకోవాలి. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే మీతో పాటు ఇతర వాహనదారులు ప్రమాదంలో పడతారు. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ బ్లాక్ స్పాట్ల వద్ద జాగ్రత్తగా ఉండాలి.

ప్ర: బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగేవారు, బెల్ట్ షాపులపై చర్యలు తీసుకుంటున్నారా?
-శివ / శ్రీనివాస్ / సురేంద్ర, భద్రాచలం
ఏఎస్పీ: డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు పెంచుతాం. ఓపెన్ ఏరియాలో మద్యం తాగితే కేసులు నమోదు చేస్తాం. బెల్ట్ దుకాణాల నిర్వహణపై ఎక్సైజ్ శాఖ అధికారులు చర్యలు తీసుకునేలా సమాచారం ఇస్తాం. యువకులు కూడా మద్యం మత్తులో అనర్థాల బారిన పడొద్దు.

ప్ర: సైబర్ నేరగాళ్ల కారణంగా మోసపోతే ఏమి చేయాలి?
-శ్రీలేఖ / సతీశ్‌కుమార్, భద్రాచలం
ఏఎస్పీ: సైబర్ బాధితులు గోల్డెన్ అవర్‌ను వినియోగించుకునేలా మోసపోయిన గంటలోగా 1930కి కాల్ చేస్తే మొత్తం డబ్బు రికవరీకి అవకాశం ఉంటుంది. దీనిపై అవగాహన పెంచుకోవాలి. వాట్సాప్‌లో వచ్చే అనుమానాస్పద ఏపీకే లింక్‌లను ఓపెన్ చేయొద్దు.

అంబరాన్నంటిన సంబురాలు



మణుగూరురూరల్: కోర్టు ఆవరణలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



ములకలపల్లి: గ్రంథాలయం వద్ద..



కరకగూడెం: బతుకమ్మతో వైద్యాధికారి, సిబ్బంది



గుండాల: బతుకమ్మ ఆడుతున్న వైద్య సిబ్బంది

మణుగూరురూరల్: మండలంలోని వణుగూరు ఫస్ట్‌క్లాస్ జ్యుడీషియల్ కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో, సింగరేణి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటాయి. సంబురాల్లో మెజిస్ట్రేట్ కంబపు సూరిరెడ్డి - గౌరి దంపతులు, ఏరియా జీఎం దుర్గం రాంచందర్ పాల్గొన్నారు. కోర్టులో బద్దం శ్రీనివాస్‌రెడ్డి, న్యాయవాదులు చిర్ర రవికుమార్, శైలజ, సరస్వతి, పద్మావతి, సునీత, సంధ్య, సావిత్రి, విజయ్, నగేశ్‌కుమార్, సాంబ, ఎం.శ్రీనివాసరావు, వెంకటరత్నం, నాగార్జునరెడ్డి, రమేశ్, సింగరేణి వేడుకల్లో ఎస్‌ఓటు జీఎం బి.శ్రీనివాసాచారి, డీజీఎం (పర్సనల్) ఎస్.రమేశ్, ఇంజనీర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ములకలపల్లిలో..

ములకలపల్లి: మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయం ఆధ్వర్యంలో శనివారం బతుకమ్మ వేడులను ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయ అధికారిణి వాణి, మహిళలు పాల్గొన్నారు.

కరకగూడెంలో..

కరకగూడెం: మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో వైద్యాధికారి రవితేజ ఆధ్వర్యంలో శనివారం బతుకమ్మ వేడుకలను నిర్వహించారు. ఆశ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు, ఇతర మహిళా సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. వేడుకల్లో హెచ్‌ఈఓ పోలెబోయిన కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

గుండాలలో..

గుండాల: దసరా ఉత్సవాల్లో భాగంగా శనివారం ఆళ్లపల్లి పీహెచ్‌సీ కేంద్రంలో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆట, పాటలతో సిబ్బంది సందడి చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారులు సంఘమిత్ర, రేవంత్, సిబ్బంది పాల్గొన్నారు.

నిలిచిన రాకపోకలు



రహదారిపై పర్యవేక్షిస్తున్న సీఐ అశోక్‌రెడ్డి

అశ్వాపురం: మండలంలో కురిసిన భారీ వర్షానికి వాగులు పొంగి ప్రవహించి శనివారం గిరిజన గ్రామాలకు రాకపోకలు నిలిచాయి. గొందిగూడెం - ఎలకలగూడెం, ఎలకలగూడెం - వేములూరు గ్రామాల మధ్య ఇసుకవాగు పలు చోట్ల పొంగి ప్రవహించి ఎలకలగూడెం, మనుబోతులగూడెం గ్రామ పంచాయతీల్లోని గిరిజన గ్రామాలకు రాకపోకలు నిలిచాయి. వాగుల వద్ద రాకపోకలు నిలిచిన ప్రాంతాల వద్ద సీఐ అశోక్‌రెడ్డి ఆధ్వర్యంలో బారికేడ్లు ఏర్పాటు చేసి, ఎవరూ వాగు దాటకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు. కాగా, మండలంలోని తుమ్మలచెరువు శనివారం అలుగు పారింది. ఖరీఫ్ ప్రారంభంలో చెరువులోకి నీరు వస్తుందా..? రాదా? అని సందిగ్ధం నెలకొనగా తర్వాత భారీ వర్షాలకు చెరువు నిండి అలుగుపోస్తోంది.

డీడీకి శుభాకాంక్షలు



శుభాకాంక్షలు చెబుతున్న ఏటీడీఓ అశోక్

భద్రాచలంటౌన్: భద్రాచలం ఐటీడీఏలో డిప్యూటీ డైరెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న మణెమ్మకు జాయింట్ డైరెక్టర్‌గా ఉద్యోగోన్నతి లభించడంతోపాటు ఈ నెల 30న ఉద్యోగ విరమణ పొందుతున్న సందర్భంగా ఏటీడీఓ అశోక్‌కుమార్‌తో పాటు ఉద్యోగులు, సిబ్బంది శనివారం శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జేడీ మణెమ్మ మాట్లాడుతూ.. 1991లో వార్డెన్‌గా ఉద్యోగంలో చేరి వివిధ జిల్లాల్లో ఏటీడీఓగా పనిచేసి కొమరం భీం ఆసిఫాబాద్‌లో డీడీగా విధుల్లో చేరినట్లు తెలిపారు.

ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించండి

మణుగూరురూరల్: ఈ నెల 27వ తేదీ నుంచి అక్టోబర్ 6వ తేదీ వరకు ఆర్టీసీ సంస్థకు చెందిన సూపర్ లగ్జరీ, డీలక్స్, లహరి, ఏసీ రాజధాని బస్సుల్లో ప్రయాణించి బహుమతులు గెలుపొందాలని టీజీ ఆర్టీసీ మణుగూరు డిపో మేనేజర్ శ్యాంసుందర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రయాణం తర్వాత టిక్కెట్ వెనుక భాగంలో పేరు, ఫోన్ నంబర్ రాసి లక్కీ డ్రా బాక్సుల్లో వేయాలని తెలిపారు. డ్రాలో మొదటి బహుమతిగా రూ.25 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.15 వేలు, తృతీయ బహుమతిగా రూ.10 వేలు అందిచనున్నట్లు డిపో మేనేజర్ వెల్లడించారు.

ఇందిరమ్మ ఇళ్ల పట్టాల పంపిణీ

చంద్రుగొండ: గిరిజనులకు ప్రత్యేకంగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసినట్లు తహసీల్దార్ సంధ్యారాణి తెలిపారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే జారె ఆదినారాయణ చొరవతో మండలానికి 123 మంది గిరిజనులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయగా.. మంజూరు పత్రాలను శనివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో భోజ్యానాయక్. అంకిరెడ్డి కృష్ణారెడ్డి, కిరణ్‌రెడ్డి, సారేపల్లి శేఖర్, ఏడుకొండలు, కె.పుల్లయ్య, సురేశ్, నర్సింహారావు పాల్గొన్నారు.

అశ్వారావుపేటలో..

అశ్వారావుపేటరూరల్: మండలంలోని నారాయణపురం, గుమ్మడవల్లితోపాటు పలు గ్రామ పంచాయతీలకు ఎస్టీ కోటా కింద మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను శనివారం ఆత్మ కమిటీ చైర్మన్ సుంకవల్లి వీరభద్రరావు చేతుల మీదుగా లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తుమ్మా రాంబాబు, బండి చెన్నారెడ్డి, ఎస్‌కే బాబా, ఆకుల శ్రీను పాల్గొన్నారు.

దమ్మపేటలో..

దమ్మపేట: ఎస్టీ సబ్ ప్లాన్ నిధులతో మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల పట్టాలను మండల పరిధిలోని జీపీ కార్యాలయాల్లో శనివారం లబ్ధిదారులకు, ఇందిరమ్మ కమిటీ సభ్యుల చేతులమీదుగా అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. పేద ప్రజలకు సొంతింటి కల కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమైందన్నారు. సన్న బియ్యం, ఉచిత బస్సు, ఉచిత కరెంట్ తదితర పథకాలతో పేదల సంక్షేమం, అభివృద్ధికి కట్టుబడిన ఏకైక పార్టీ కాంగ్రెస్ అని పేర్కొన్నారు.

ములకలపల్లిలో..

ములకలపల్లి: ఎస్టీ సబ్‌ప్లాన్‌లో ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన పలువురు లబ్ధిదారులకు శనివారం పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని జీపీ కార్యాయలంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తాండ్ర ప్రభాకర్ పాల్గొని, పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతీ నిరుపేద కుటుంబానికి గూడు కల్పించడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. జీపీ కార్యదర్శి రవి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, పలుపార్టీల నాయకులు గంటా వెంకటేశ్వర్లు, నరాటి రమేశ్, కటికనేని ఆదిత్య, అనుమల సాయి, సంపత్, నల్లి రాము పాల్గొన్నారు.

కొండా లక్ష్మణ్ జయంతి

మణుగూరురూరల్: కొండా లక్ష్మణ్‌బాపూజీ సేవలు చిరస్మరణీయమని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం లక్ష్మణ్‌బాపూజీ జయంతి సందర్భంగా పద్మశాలి సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి, మండల అధ్యక్షుడు దుస్సా సమ్మయ్య ఆధ్వర్యంలో విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మహేశ్వరపు రమేష్, కోట శ్రీనివాస్, రుద్ర నాగరాజు, కుర్రి నర్సింహారావు, గుండ్ల వెంకటేశ్వరరావు, కోట రాంబాబు, వెన్నం వెంకట్రావు, గంగిశెట్టి శ్రీనివాస్, తాటి సత్యనారాయణ పాల్గొన్నారు.

అశ్వారావుపేటలో..

అశ్వారావుపేటరూరల్: లక్ష్మణ్‌బాపూజీ జయంతిని శనివారం నిర్వహించారు. మున్సిపాలిటీ కార్యాలయంలో కమిషనర్ బానోతు నాగరాజు బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

అలుగు పారుతున్న చెరువులు



అలుగుపారుతున్న గుబ్బలమంగి వాగు



పరికల చెరువు అలుగును పరిశీలిస్తున్న ఇరిగేషన్ జేఈఈలు రాజ్‌సుహాస్, హర్షనాగ్

దుమ్ముగూడెం: మండలంలో కురుస్తున్న వర్షాలకు పలు వాగులు, చెరువులు అలుగుపారుతున్నాయి. మండలంలోని మారాయిగూడెంలోని పరికల చెరువు, తాటివారిగూడెంలోని గుబ్బలమంగి వాగు ప్రాజెక్టుకు అలుగుపడగా, అచ్చితాపురం గ్రామంలోని గంగోలుచెరువుకు అలుగుపారి బుర్రవేముల శివారులో భద్రాచలం - చర్ల ప్రధాన రహదారిపైకి చేరింది. దీంతో రాకపోకలు నిలిచిపోయాయి. పర్ణశాల నారచీరల ప్రాంతం వరద నీటిలోనే ఉండగా సున్నంబట్టి - బైరాగులపాడు గ్రామాల మధ్య రహదారిపై భారీగా వరద నీరు చేరింది.

సాంకేతిక పరిజ్ఞానం అందించాలి



మాట్లాడుతున్న సుంకవల్లి వీరభద్రరావు

అశ్వారావుపేటరూరల్: రైతాంగానికి సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించేందుకు కృషి చేయాలని ఆత్మ కమిటీ చైర్మన్ సుంకవల్లి వీరభద్రరావు అన్నారు. శనివారం అశ్వారావుపేట రైతు వేదికలో ఆత్మ కమిటీ తొలి సమావేశాన్ని నిర్వహించగా.. వీరభద్రరావు పాల్గొని మాట్లాడారు. ఆత్మ కమిటీ ద్వారా రైతులకు సేవలు అందించే విధంగా ప్రయత్నిస్తామన్నారు. అలాగే రైతు వేదికల్లో కనీస సౌకర్యాలు లేవని, దీనిపై అన్ని మండలాల నుంచి నివేదిక సమర్పిస్తే సౌకర్యాల కల్పన కోసం నిధులు మంజూరుకు కృషి చేస్తానని తెలిపారు. సమావేశంలో తుమ్మా రాంబాబు, నండ్రు రమేశ్, బండి చెన్నారెడ్డి, ఏడీఏ రవికుమార్, ఏఓలు శివరాంప్రసాద్, వినయ్, ఏఈఓలు సతీశ్, షాకీరాభాను, ఆత్మ కమిటీ సభ్యులు నండ్రు భారతి, రాము, పగడాల కృష్ణారావు, వెంకటేశ్, రైతులు పాల్గొన్నారు.

సీపీఎం సత్తా చాటుతాం..



సమస్యలు తెలుసుకుంటున్న సీపీఎం శ్రేణులు

దుమ్ముగూడెం: త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఎం సత్తా చాటుతుందని ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు యలమంచి వంశీకృష్ణ తెలిపారు. శనివారం ప్రజా సమస్యల అధ్యయనం, పరిష్కారం, దుమ్ముగూడెం మండలంలో ప్రధాన రహదారి మరమ్మతుల కోసం జరుగుతున్న పాదయాత్రను జయప్రదం చేయాలని కోరుతూ దుమ్ముగూడెం, పెద్దనల్లబెల్లి, గౌరారం, పెద్దబండిరేవు, ముల్కనాపల్లి, జిన్నెల గూడెం ప్రాంతాలలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధాన రహదారి మరమ్మతుల కోసం జరుగుతున్న పాదయాత్రను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో యలమంచి శ్రీనుబాబు, సరియం కోటేశ్వరరావు, సోయం వీర్రాజు, పాయం హరిబాబు, బైరెడ్డి సతీష్, రాజేష్, దల్లి వేణు, బర్రి నరసింహారావు, చుక్క గణేష్ రెడ్డి, యాకోబు రెడ్డి, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు రేబిస్ వ్యాక్సిన్ శిబిరం

మణుగూరురూరల్: ప్రపంచ రేబిస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని వాసవీనగర్ ప్రాంతంలో గల మణుగూరు ప్రాథమిక పశువైద్య కేంద్రంలో ఆదివారం ప్రత్యేక రేబిస్ వ్యాక్సిన్ శిబిరం, అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పశువైద్యాధికారిణి ఎన్నమల్ల సరస్వతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రేబిస్ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు శిబిరం ఉంటుందని వివరించారు.

పోలింగ్ ప్రక్రియపై శిక్షణ



దమ్మపేట: శిక్షణలో మాట్లాడుతున్న ఎంఈఓ లక్ష్మి

అశ్వారావుపేటరూరల్: స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియపై ఎన్నికల రిటర్నింగ్ అధికారి(ఆర్వో), సహాయ రిటర్నింగ్ అధికారి (ఏఆర్వో)లకు శనివారం తొలి విడత శిక్షణ నిర్వహించారు. స్థానిక గిరిజన భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్ శ్రీశైలం (సిద్ధూ) ఆధ్వర్యంలో 436 మంది హాజరయ్యారు. కార్యక్రమంలో ఎం.కుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

చంద్రుగొండలో..

చంద్రుగొండ/అన్నపురెడ్డిపల్లి: స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ప్రిసైడింగ్ అధికారులకు చంద్రుగొండ, అన్నపురెడ్డిపల్లి మండలాల్లో శనివారం శిక్షణ తరగతులు నిర్వహించారు. చంద్రుగొండ మండలంలో 14 పంచాయతీల్లో 134 వార్డులు, అన్నపురెడ్డిపల్లిలో 98 వార్డులకు 113 మంది ప్రిసైడింగ్ అధికారులు పాల్గొన్నారు. సూపరింటెండెంట్లు కిరణ్కుమార్, మధుసూదన్‌రావు, శ్రీనివాసాచార్యులు అవగాహన కల్పించారు.

ములకలపల్లిలో..

ములకలపల్లి: స్థానిక సంస్థల ఎన్నికల నిమిత్తం ప్రిసైడింగ్ ఆఫీసర్ల (పీఓ)లకు శనివారం శిక్షణ ఇచ్చారు. మండల కేంద్రంలోని రైతువేదికలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎన్నికల నిర్వహణపై సమగ్రంగా వివరించారు. ఇంచార్జ్ ఎంపీడీఓ రామారావు, ఇంచార్జ్ ఎంపీఓ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో అఖిలపక్ష పార్టీల నాయకులతో ఎంపీడీఓ రామారావు సమావేశం నిర్వహించారు.

దుమ్ముగూడెంలో..

దుమ్ముగూడెం: మండల అభివృద్ధి సమావేశ మందిరంలో పంచాయతీ ఎన్నికల ప్రిసైడింగ్ అధికారులకు శనివారం శిక్షణ ఇచ్చారు. ఓటింగ్ సమయంలో అధికారులు నిర్వహించాల్సిన, నిర్వహించకూడని బాధ్యతల గురించి శిక్షకులు ప్రత్యేకంగా వివరించారు. కార్యక్రమంలో సీఆర్‌పీలు ఏజీ ప్రభాకర్, రత్నాకర్, ప్రిసైడింగ్ అధికారులు పాల్గొన్నారు.

దమ్మపేటలో..

దమ్మపేట: మండల కేంద్రంలోని మల్లారం రైతు వేదికలో ప్రభుత్వ ఉద్యోగులకు, ఎన్నికల ప్రిసైడింగ్ ఆఫీసర్‌కు శిక్షణా కార్యక్రమం శనివారం నిర్వహించారు. పోలింగ్ ప్రక్రియ ప్రారంభం నుంచి తుది వరకు ఎన్నికల నిర్వహణ తీరును సమగ్రంగా వివరించారు. కార్యక్రమంలో ఎంఈఓ కీసర లక్ష్మి, ప్రభుత్వ ఉపాధ్యాయులు, ఫారెస్టు, అంగన్వాడీ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.